విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 17, అక్టోబరు 2025

ప్రజాధనం దుర్వినియోగమే తప్ప రాష్ట్రానికి లాభం ఏంటి : సీపీఐ

విశాలాంధ్ర - బనగానపల్లె: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీఎస్టీ సంస్కరణ సభ వల్ల ప్రజా దుర్వినియోగం తప్ప రాష్ట్రానికి ప్రయోజనం ఏమిటని జిల్లా సీనబీపీఐ కార్యదర్శి ఎన్.రంగ నాయుడు అన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ మండల కార్యదర్శి శివయ్య ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్.రంగనాయుడు మాట్లాడుతూ రూ.55 లక్షల కోట్లతో జీఎస్టీ పేరుతో ప్రజల నుంచి వసూలు చేసి, కేవలం రూ.48 వేల కోట్లు ప్రజలకు ఊరట కల్పించామనడం ప్రజలను మోసం చేయడం కాదా అరి ప్రశ్నించారు. జీఎస్టీ సంస్కరణ సభ వల్ల 10 వేల బస్సులు, 8 వేల పోలీస్ బలగాలు, ప్రభుత్వ అధికారులు, రూ.500 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం జరిగిందని విమర్శించారు. విభజన సమయంలో రాష్ట్రానికి ఇస్తానన్న ప్రత్యేక హోదా, బుందేల్ ఖండ్ ప్యాకేజీ, వెనుకబడిన ఉత్తరాంధ్ర రాయలసీమ జిల్లాలకు నిధులు కేంద్ర ప్రభుత్వం ఇవ్వకుండా మోసం చేస్తుందన్నారు. వీటిని సాధించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఎందుకు ప్రశ్నించడం లేదని రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడడానికి ఆంధ్రప్రదేశ్ టీడీపీ కారణం కాదా అన్నారు. అలాంటప్పుడు నారా చంద్రబాబు నాయుడు మౌనం వెనుక కారణమేమిటన్నారు. ఇప్పటికైనా రాష్ట్రానికి రావాల్సిన ప్రయోజనాలు కేంద్రం మెడలు వంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాధించాలన్నారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీలు విఫలం కావడంతో నిరుద్యోగులు నాయకులను ఆశ్రయించి వారి చేతిలో డబ్బులు పెట్టి మోసపోతున్నారన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం దొర్నిపాడులో నిరుద్యోగుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.3 లక్షలు, మొత్తం రూ.1.50 కోట్ల స్కాంలో టీడీపీ నాయకులు ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, నిందితులపై కఠిన చర్యలు తీసుకొని బాధితులకు తిరిగి డబ్బులు ఇప్పించి, కఠినంగా శిక్షించి ఎమ్మెల్యే అఖిలప్రియ చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు. సిద్దేశ్వర అలుగు నిర్మించాలని, వేదవతి, గండ్రేవుల ప్రాజెక్టు పూర్తి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. శ్రీశైలం నుంచి వేల టీఎంసీల నీరు సముద్రం పాలవుతుందన్నారు. మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి దద్దనాల చెరువు ఎత్తిపోతలకు రూ.25 లక్షలతో మరమ్మత్తులు చేసినప్పటికీ నీరు నింపడంలో విఫలమయ్యారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న, ఉల్లి తదితర పంటలకు గిట్టుబాటు కలిపించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సుగాలి ప్రీతికి న్యాయం చేస్తానని వాగ్దానం చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారంలోకి వచ్చిన తర్వాత నేడు మొహం చాటేశారన్నారు. పలుకురులో జరుగుతున్న మైనింగ్ మాఫియా అడ్డుకోవాలని గ్రామ ప్రజలు జిల్లా కేంద్రం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ రాజకుమారికి ఫిర్యాదు చేశారని, స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి నిలుపుదల చేసి చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు సంజీవులు, సుబ్బారెడ్డి, జిల్లా ఏఐటీయూసీ ఆర్గనైజేషన్ సెక్రెటరీ శివ బాలకృష్ణ, ప్యాపిలి మండల కార్యదర్శి మహేష్, పార్టీ నాయకులు నాగాంజనేయులు, ఏఐటీయూసీ కుళాయి స్వామి, ఏఐఎస్ఎఫ్ చందు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలమల్లన్న సేవలో భారత ప్రధాని

విశాలాంధ్ర - శ్రీశైలం: అష్టాదశ శక్తి పీఠంగా జ్యోతిర్లింగ క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీశైల మహా క్షేత్రం లోని శ్రీ భ్రమ రాంబ మల్లికార్జున స్వామి వార్లను భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ గురువారం ఉదయం దర్శించుకుని సేవించుకున్నారు. వీరితో పాటు రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయు డు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఉన్నారు. కర్నూలు నుండి ప్రత్యేక హెలికాప్టర్లో సున్నిపెంట హెలిప్యాడ్ వద్దకు చేరు కున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి పలువురు రాజకీయ ప్రముఖులు నాయకులు స్వాగతం పలికారు. అక్కడి నుండి రోడ్డు మార్గంలో శ్రీశైలం చేరుకొని శ్రీభ్రమ రాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ దర్శన ప్రత్యేక పూజలు అనం తరం వేద ఆశీర్వచనం మండ పంలో వేద పండితులు చతు ర్వేద ఆశీర్వ చనం చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలను, అమ్మ వార్ల చిత్రపటాలను శేష వస్త్రాలను ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గౌరవంగా ప్రధంగా ప్రధానమంత్రికి అందించారు. తర్వాత శ్రీశైలంలోని శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించి, చరిత్ర విశేషాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జిల్లా ఎస్పీ సునీల్ శరాన్, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, అడిషనల్ ఐజీ ఆకే రవికృష్ణ, పోలీస్ ఉన్నతాధికారి అదిరాజ్ సింగ్ రాణా, ఆలయ ఈవో శ్రీనివాసరావు తదితరు పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో వర్షం..

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: మండలంలోని ఆయా గ్రామాలలో గురువారం ఉరుములు మెరుపులతో మోస్తరు నుండి భారీ వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా ఉదయం నుండి మేఘావృతమైనప్పటికీ మధ్యాహ్నం నుండి అడపాదడపా మోస్తారు వర్షం పడినప్పటికీ సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఐదు రోజుల నుండి మోస్తారు వర్షం కురుస్తుండడంతో సాగు పొలాలలో తడి శాతం పెరిగి పంటలు దెబ్బతినే పరిస్థితి నెలకొంది. మండలంలోని ఎర్రగుడి, హనుమంత గుండం, నాగిశెట్టిపల్లి, తిమ్మనాయునిపేట, చింతలాయిపల్లి, మదనంతపురం, నందిపాడు, అబ్దుల్లాపురం, కోటపాడు, ఉప్పులూరు తదితర గ్రామాల్లో రోజువారి వర్షాల రాకతో ఇబ్బంది పడుతున్నారు. రబీలో వర్షధారంగా పప్పు సెనగ పంట ను సాగు చేయడానికి రైతన్నలు విత్తనాలను, ఎరువులను సిద్ధం చేసుకున్నప్పటికి వర్షం మాత్రం వీడడం లేదు. దీంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

ప్రధానికి స్వాగతం పలికిన జిల్లా అధ్యక్షులు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: శ్రీశైల మహా క్షేత్రాన్ని దర్శించుకునేందుకు విచ్చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీకి జిల్లా బీజేపీ అధ్యక్షులు అభిరుచి మదు హృదయపూర్వక స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అభిరుచి మధు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్, శ్రీశైల మల్లన్నను దర్శించుకొని, భవానీ మాతను స్మరించుకుంటూ ధ్యానం చేసిన చారిత్రాత్మక పుణ్యభూమికి సాక్షాత్తు దేశ ప్రధాని నరేంద్రమోడీ విచ్చేయడం మనందరి అదృష్ట మని, ఇది చారిత్రక ఘట్టమని, శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని ప్రధాని సంద ర్శించి, భవానీ మాతను స్మరించడం పూర్వ జన్మ సుకృతమని మధు పేర్కొన్నారు. శ్రీశైల మల్లికార్జున స్వామివారి దివ్య ఆశీస్సులు, భ్రమ రాంబ అమ్మవారి కరుణా కటాక్షాలు మన ప్రియతమ ప్రధానిపై ఉండా లని మనస్ఫూర్తిగా కోరుకుంటూ జిల్లా బిజెపి శ్రేణుల తరపున హృదయ పూర్వక స్వాగతం పలుకుతున్నామన్నారు.

ఫరూక్‌ను ఆత్మీయంగా పలుకరించిన ప్రధాని

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: రాష్ట్ర పర్యటన సందర్భంగా కర్నూలులోని నన్నూరు టోల్ ప్లాజా వద్ద నిర్వహించిన సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ భారీ బహిరంగ సభ విజయవంతంగా ముగిసిన అనంతరం, దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడి రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను ఆత్మీయంగా పలకరించి, కరచాలనం చేస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ ప్రధాని మోడీ తనను పలకరించడం ఆనందంగా ఉందని, ఉమ్మడి కర్నూలు జిల్లాల అభివృద్ధికి మోడీ సహకారం మరువలేనిదాన్నారు.

దొంగతనం కేసులో పోలీస్ కానిస్టేబుల్ అరెస్టు

విశాలాంధ్ర - డోన్: మూడ్రో జుల కిందట పట్టణంలోని శ్రీరామ్ నగర్ దగ్గర గొలుసు దొంగ తనం యత్నం చేసిన కానిస్టేబు ల్ కేసులో పోలీస్ కానిస్టేబుల్ అరెస్టు చేసి, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సిఐ ఇంతియాజ్ అన్నారు. పట్టణంలో జరిగిన గొలుసు దొంగతనం యత్నం కేసులో ప్రమేయం ఉన్నట్లు నిర్ధారణ కావడంతో పోలీస్ కానిస్టేబుల్ ఆచారిని డోన్ పోలీసులు అరెస్టు చేశారు. సంఘటన జరిగిన వెంటనే ధోన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తు సమయంలో తగిన ఆధారాలు లభించడంతో నిందితుడిని గురువారం అరెస్టు చేశారు. అనంతరం నిందితుడిని డోన్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజి స్ట్రేట్ ముందు హాజరుపరచగా, కోర్టు అతనిని 15 రోజుల జ్యుడిషి యల్ కస్టడీకి పంపింది. ఈ సందర్భంగా చట్టానికి ఎవరూ మించి లేరన్నారు. ఈ ఘటనపై మరింత లోతైన విచారణ కొనసాగుతోంది.

అంకితభావం, నిబద్ధత, ఆత్మశుద్ధతలతో పని చేయాలి

విశాలాంధ్ర-డోన్ : మెగా డీఎస్సీ-2025లో ఉద్యోగం పొందటానికి అహర్నిశలు ఎంతో శ్రమించి పట్టుదలతో కృషిచేసి, ఉద్యోగం సాధించారో వారందరూ వాస్తవిక కార్యక్షేత్రంలో అడుగుపెట్టిన తర్వాత అదే అంకితభావం, అదే పట్టుదల, అదే ఆత్మశుద్ధత, అదే నిబద్ధతతో పనిచేస్తే డోన్ మండల విద్యాధికారి ఎ.ప్రభాకర్ ఆకాంక్షించారు. విద్యారంగం ఎంతో పురోగమిస్తుందని, అన్ని విద్యాలయాలు విద్యార్థులతో కళకళలాడుతాయని, విద్యార్థుల మంచి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దబడతారని, ఆ కోణంలో అందరూ కృషి చేయాలన్నారు. మండల శాఖ అధ్యక్షులు భాస్కర్ అధ్యక్షతన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎన్ఎన్ కాలనీలో ఇటీవల డీఎస్సీ ద్వారా ఎంపికై డోన్ మండలంలోని వివిధ పాఠశాలల్లో విధులలో చేరిన కొత్త ఉపాధ్యాయులకు అభినందనలతో పాటు సర్వీస్ రిజిస్టర్‌లను బహూకరించే కార్యక్రమం జరిగింది. దాదాపు 36 మంది నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిష్టర్లు, పెన్నులను అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఇ.షణ్ముర్తి, మండల విద్యాధికారులు ఎ.ప్రభాకర్ శ్రీ హెచ్.రఘునాయక్ పాల్గొన్నారు. మండల విద్యాధికారి2 రఘునాయక్ మాట్లాడుతూ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి, విద్యాలయాలను పునరుజ్జీవింప చేయడానికి కొత్తగా చేరిన ఉపాధ్యాయులు ప్రవర్తించవలసిన విధానాన్ని, చేయవలసిన బాధ్యతలను వివరించారు. ఇ.షణ్ముర్తి మాట్లాడుతూ రాష్ట్రోపాధ్యాయ సంఘం చరిత్ర పుట్టుపూర్వోత్తరాలను గురించి, ప్రభుత్వం నుంచి మనం పొందవలసిన సౌకర్యాల కోసం పోరాటాలు చేయవలసిన అవసరాన్ని, మన బాధ్యతలను మనం సక్రమంగా త్రికరణ శుద్ధిగా నిర్వహిస్తూ హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఇ.షణ్ముర్తి, డోన్ మండల విద్యాధికారి-1 ఎ. ప్రభాకర్, ఎంఈఓ-2 రఘు నాయక్, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఇక్బాల్ బాష, జి.వి.రమణ, మౌలాలి, సురేష్ బాబు, దేవేంద్రప్ప, వెంకట నాయక్, డోన్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భాస్కర్, విశ్వనాథ్, నందప్ప, శ్రీనివాస కుమార్, సుంకన్న, చిన్నప్పరెడ్డి, హాజమస్తాన్ వలి, చంద్రబాబు, తదితర నాయకులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయాలి : సీపీఐ

విశాలాంధ్ర - డోన్: దొంగతనాలు అరికట్టాల్సింది పోయి, అతనే దొంగతనానికి పాల్పడిన కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి మోటా రాముదు అన్నారు. గురువారం సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి మోటా రాముదు, సహాయ కార్యదర్శి ఎస్కే రామమోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ డోన్ పట్టణంలో వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్న తరుణంలో దొంగతనాలను అరికట్టాల్సిన పోలీసు, దొంగతనానికి పాల్పడితే ప్రజలకు రక్షణ కల్పించే వారు ఎవరని ప్రశ్నించారు. పట్టణంలోని శివారు కాలనీల్లో గంజాయి బ్యాచ్ మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన గతంలో జరిగాయని వారు ఆరోపించారు. పట్టణంలో దొంగతనాలను అరికట్టకపోతే సీపీఐ ఆధ్వర్యంలో పోరాటానికి సిద్ధమవుతామన్నారు. ఎవరైతే దొంగతనానికి పాల్పడి మహిళను గాయపరిచిన కానిస్టేబుల్‌పై కఠిన చర్యలు తీసుకొని, ఉద్యోగం నుండి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ డోన్ కార్యదర్శి అబ్బాస్, దొరపల్లె కార్యదర్శి కొండయ్య పాల్గొన్నారు.

సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలి : ఎస్టీయూ

విశాలాంధ్ర - చాగలమర్రి : సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం దేశవ్యాప్తంగా ఉపాధ్యాయులందరూ టెట్ పాస్ కావాలని నిబంధన విధించడం సరికాదని, 2010 ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుండి ప్రభుత్వం మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర కార్యదర్శి ఈవీ గోపాలకృష్ణ, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.శివశంకర్, జిల్లా అధ్యక్షులు డి.మౌలాలిలు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో ఆర్థిక కార్యదర్శి మాబు హుస్సేన్ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎంతో అనుభవం ఉన్న ఉపాధ్యాయులు అర్హత పరీక్ష రాయాలనడం సరికాదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లకు రావలసిన ఆర్థిక బకాయిలను చెల్లించడంలో అలసత్వం వహిస్తూ ఉన్నదని ఇప్పటికే 15 నెలల కాలం అయిందని, అందరూ ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే 31 వేల కోట్ల ఆర్థిక బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. బోధనేతర పనుల వల్ల ఉపాధ్యాయులపై ఒత్తిడి పెరుగుతూ ఉన్నదని కావున ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా సహాధ్యక్షులు నరసింహారావు, జిల్లా ఉపాధ్యక్షులు మహబూబ్ బాష, సీనియర్ నాయకులు, సుధాకర్ గుప్తా, శేషాద్రి, కృష్ణ శాస్త్రి, జయరాజు, ఈవీ రమేష్ బాబు, గురు చంద్రుడు, మహబూబ్ బాష, వై.శ్రీనివాసులు, గౌస్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

శబరీ.. నీకు నా ఆశీస్సులన్న ప్రధాని మోడీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: శ్రీశైలం పర్యటనలో భాగంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ గురువారం కర్నూలు జిల్లా ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్నారు. ఓర్వకల్లు విమానాశ్రయంలో రాష్ట్ర గవర్నర్ నజీర్ అహమ్మద్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు, నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తదితరులు ప్రధాని మోడీకి ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానమంత్రికి మంత్రులు, ఎంపీలను పరిచయం చేస్తూ నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని ప్రధాని మోడీకి సీఎం పరిచయం చేస్తుండగా వెంటనే స్పందించిన ప్రధాని మోడీ శబరి వల్లే తాను శ్రీశైలం వచ్చానని, పార్లమెంట్‌లో పలుమార్లు శ్రీశైలం రండి, శ్రీ భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్లను దర్శనం చేసుకోవాలని పిలిచారని తెలిపారు. ఆమె తనను చాలాసార్లు శ్రీశైలానికి రమ్మని పిలిచిందని, శబరి వల్లే శ్రీశైలం వచ్చానని, శబరి మీకు నా ఆశీస్సులు అని ప్రధానమంత్రి అన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకుందాం

విశాలాంధ్ర - నందికొట్కూరు: బోధనేతర కార్యక్రమాల వలన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య నానాటికి తగ్గి పోతుందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.సుధాకర్, జిల్లా కార్యదర్శి మూర్తు జావలి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం నందికొట్కూరులో ముఖ్య కార్య కర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడి బోధన తప్ప ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, గూగుల్ లింక్ ఫార్మ్స్, డేటా అప్‌లోడ్, యోగ దినోత్సవాలు, మెగా పేరెంట్ మీటింగ్‌లు, కర్మ యోగి, స్వచ ఆంధ్రా, స్వర్ణాంధ్ర, లీడర్ షిప్ ట్రైనింగ్‌లు, ఎఫ్ఎల్ఎన్ శిక్షణలు, ఎన్ఎంఎంఎస్ పరీక్షలు, బబ్లింగ్ మిడ్డే మిల్స్, గుడ్లు, చిక్కీలు, జీఎస్‌టిపై వ్యాస రచన పోటీలు, రికార్డులు, రిజిస్టర్‌లు తదితర పనులలో ఉపా ధ్యాయులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వాటి నుంచి విముక్తి కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాముడు, వాసు, రంగస్వామి, జగదీష్, సురేంద్ర, మధు, మనోహర్, నాగేశ్వర రావు, మునీంద్ర తదితరులు పాల్గొ న్నారు.

ప్రపంచ అనస్తీషియా దినోత్సవం సందర్భంగా డాక్టర్ రవికృష్ణకు సత్కారం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: ప్రపంచ అనస్తీషియా దినోత్సవం పురస్కరించుకుని స్థానిక కళారాధన కార్యాలయంలో నంద్యాల మొట్టమొదటి అనస్తీషియా వైద్య నిపుణులు డాక్టర్ రవికృష్ణను జిల్లా బాషో పాధ్యాయుల సంస్థ అధ్యక్ష కార్యదర్శులు కన్నయ్య, హుస్సేన్ మియా ఆధ్వర్యంలో ఘనంగా గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అవ్వారి శేషఫణి, ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి అన్నెం శ్రీనివాసరెడ్డి, బాషోపాధ్యాయుల సంస్థ జిల్లా అధ్యక్షులు కన్నయ్య, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ 1992లో నంద్యాలకు మొట్ట మొదటి అనస్తీషియా వైద్య నిపుణులుగా వచ్చిన డాక్టర్ రవికృష్ణ గత 33 ఏళ్లుగా అనస్తీషియా వైద్య సేవలు అందించారని కొనియాడారు. కొన్ని వేల శస్త్ర చికిత్సలకు మత్తుమందు ఇచ్చి వివిధ రకాల శస్త్ర చికిత్సల కోసం నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నంద్యాలలోనే జరగడానికి దోహదం చేశారన్నారు. కేవలం వైద్యునిగానే కాకుండా కళారాధన వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా నంద్యాలకు అనేక నంది పురస్కారాలను, వివిధ పరిషత్తు పోటీల రాష్ట్రస్థాయి బహుమతులను తీసుకువచ్చారని, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులుగా, లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులుగా నిరంతర సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని, జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను నంద్యాలలో నిర్వహించి క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారన్నారు. వీరి కృషికి రాష్ట్ర ప్రభుత్వం కళారత్న హంస పురస్కారం, ఉగాది తెలుగు తల్లి పురస్కారం, కందుకూరి రాష్ట్రస్థాయి తెలుగు నాటక రంగ పురస్కారాలు అందజేసి గౌరవించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాషోపాధ్యాయుల సంస్థ ప్రతినిధులు విశ్వనాథరెడ్డి, సుధాకర్ గౌడ్, లింగమయ్య, ముస్తఫా, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎంపీవి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. ప్లాస్టిక్ భూతానికి ఆహుతవుతున్న మూగజీవాలు

- కాలనీల్లో చెత్త కుప్పలమయం
- అడుగడుగునా పారిశుద్ధ్య వైఫల్యం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: పారిశుద్ధ్యంపై అధికారుల నిర్లక్ష్యం మూగజీవాల పాలిట మృత్యుశాపంగా మారింది. పట్టణంలో పురపాలక యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో, ఎక్కడ చూసినా చెత్త కుప్పలు పేరుకుపోయి, ప్రజారోగ్యానికి పెనుముప్పుగా పరిణమించాయి. ఈ చెత్త, ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలను తిని ఆవులు, బరుగొడ్లు (గేదెలు) నరకయాతన అనుభవిస్తున్నాయి. అధికారుల వైఫల్యం వల్లే ఈ మూగ జీవాలు చనిపోయే పరిస్థితి దాపురించిందంటూ పట్టణ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, కాలనీల మధ్య ఖాళీ స్థలాలు, రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్త కుప్పలు చూస్తే పట్టణంలో పారిశుద్ధ్య పర్యవేక్షణ ఎంత ఘోరంగా ఉందో అర్థమవుతుంది. మురుగు కాలువలు చెత్తతో మూసుకుపోయి, దోమలకు ఆవాసంగా మారాయి. తడి, పొడి చెత్త వేరు చేయకుండా రోడ్ల పక్కన పారవేయడం, వాటిని సకాలంలో తొలగించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట. మురికి వాసనతో పాటు, చెత్త కుప్పల కారణంగా దుర్వాసన నగరమంతా వ్యాపిస్తోంది. ఈ చెత్త కుప్పలలో ఎక్కువగా ప్లాస్టిక్ కవర్లలో వేసిన ఆహార వ్యర్థాలు ఉంటున్నాయి. ఆకలితో అలమటిస్తున్న ఆవులు, గేదెలు తమకు ఇవే ఆహారం అనుకుని, ఆ ప్లాస్టిక్ కవర్లతో సహా తినేస్తున్నాయి. ప్లాస్టిక్ వాటి జీర్ణవ్యవస్థలో పేరుకుపోయి, కడుపులో గడ్డలుగా మారుతోంది. ఈ మూగజీవాలకు ప్లాస్టిక్ కవర్లలో ఆహారం ఉంటే తినకూడదనే జ్ఞానం లేదు. వాటి పరిస్థితి చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది. కడుపు ఉబ్బి, నడవడానికి కూడా కష్టపడుతున్న వాటికి చికిత్స చేయించడానికి కూడా దిక్కులేదు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ఆవులు, బరుగొడ్లు ప్లాస్టిక్ విషంతో పోరాడుతూ మృత్యువాత పడుతున్నాయని స్థానిక పశు సంరక్షకులు, ప్రజలు వాపోతున్నారు. పశువులకు ప్లాస్టిక్ కారణంగా కలిగే ఇబ్బందుల తీవ్రతను అధికారులు పూర్తిగా విస్మరించడం దారుణం. ప్రభుత్వం పట్టణ ప్రగతి వంటి కార్యక్రమాలకు నిధులు కేటాయిస్తున్నా, క్షేత్ర స్థాయిలో శానిటేషన్ పనులు మాత్రం సరిగా జరగడం లేదు. చెత్త సేకరణ వాహనాలు ప్రతీ రోజు కాలనీల్లో తిరగడం లేదు. పారిశుద్ధ్య సిబ్బంది తమ డ్యూటీని సరిగా నిర్వర్తించడం లేదని, అధికారులు వారికి బాధ్యత అప్పగించి పర్యవేక్షించడంలో పూర్తిగా విఫలమయ్యారని పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. శానిటేషన్ పనులపై అధికారులు తక్షణం దృష్టి సారించి, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, మూగజీవాల ప్రాణాలను రక్షించాలని పట్టణ ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేదంటే ప్రజల తరపున పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

ప్రధాన మంత్రి రాకతో అధికారులకు అగచాట్లు

విశాలాంధ్ర - నంద్యాల రూరల్: దేశ ప్రధాని నరేంద్ర మోడీ రాకతో నంద్యాల, కర్నూలు జిల్లాల్లో అధికారులు అగచాట్లు పడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, విద్యార్థులు ఇక్కట్లు పడ్డారు. ప్రధానంగా దేశ ప్రధానమంత్రి ఉమ్మడి జిల్లాలకు రావడంతో ప్రజలు విద్యార్థులు నానా ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం తమ పలుకుబడి కోసం రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రవేట్ పాఠశాలలకు సెలవులు ప్రకటించి, జన సమీకరణ కోసం బస్సులను ఉపయోగించుకుని ప్రయాణికులకు, ప్రజలకు ఇబ్బందులు చేశారు. సమయానికి బస్సులు లేక ప్రజలు అవస్థలు పడిన కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం సమంజ సంగా లేదని ప్రజలు నుండి విమర్శలు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వారి పలుకుబడి కోసం విద్యార్థులకు సెలవు ప్రకటించి, వారు భవిష్యత్తును నాశనం చేయడానికి పరోక్షంగా కంకణం కట్టుకున్నారు. కాగా రాష్ట్రంలో ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్న వాటిని పట్టించుకోకుండా కేవలం ప్రధానమంత్రిని పిలిపించుకొని, రాష్ట్రవ్యాప్తంగా బస్సులను జనాలను సమీకరించుకోవడానికి ప్రజలను ఇబ్బంది చేసి తమ పబ్బం గడుపుకున్నారు. అధికారులను గత పది రోజుల నుండి ప్రధానమంత్రి వస్తున్నాడనే నేపంతో వారి విధులకు ఆటంకం కలిగించి ప్రజలకు ఇబ్బంది కలగజేసి తమ సొంత ప్రయోజనాల కోసం అన్ని రంగాల ప్రభుత్వ అధికారులను ఉపయోగించుకోవడం ఎంతవరకు సమంజసమని విశ్లేకులు విమర్శిస్తున్నారు. గత రెండు రోజుల నుండి ప్రజలు హాస్పిటల్స్‌కి వెళ్లాలన్న, విద్యార్థులు కళాశాలకు వెళ్లాలన్న బస్సులు సమయానికి రాక నానా అవస్థలు పడుతున్న కూటమి ప్రభుత్వం మాత్రం తమ ప్రయోజనాల కోసం కోట్లాది రూపాయల ప్రజల సొమ్ముతో బహిరంగ సభ నిర్వహించుకుని తమ పబ్బం కడుపుకున్నారని ఆరోపణ వినిపిస్తున్నాయి. విద్యార్థులకు పరీక్షల సమయంలో రెండు రోజుల సెలవులు ప్రకటించి వారి భవిష్యత్తును సర్వనాశనం చేశారు. ఏనాడైనా విద్యార్థుల పరీక్షలను పక్కనపెట్టి సెలవులు ప్రకటించడం బహిరంగ సభలు జరుపుకోవడం ఎప్పుడైనా జరిగిందా అని విద్యార్థుల తల్లి దండ్రులు బహిరంగంగా ప్రశ్నిస్తున్నారు. కాగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రానికి, దేశానికి ఏమి మేలు చేశారని వామపక్షాలు బహిరంగంగా ప్రశ్నిస్తూన్నా చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం తమ ప్రయోజనాల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ప్రజలకు పంగనామాలు పెట్టి పాలనా సాగించడం అవసరమా అని ప్రజలు, వామపక్ష పార్టీలు విమర్శిస్తున్నారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం : కె.రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ప్రదాని నరేంద్రమోడీ కర్నూలులో పర్యటన సందర్భంగా ముందస్తుగా సీపీఐ, సీపీఎం నాయకులను అక్రమంగా అరెస్టు చేయడంను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఓ ప్రకటనలో గురువారం ఖండించారు. ప్రధాని పర్యటను దృష్టలో పెట్టుకుని పోలీసులు అత్యూత్సాహం ప్రదర్శించి, ముందస్తుగా సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శులు చంద్రశేఖర్, సి.మహేష్, సీపీఎం నాయకులు నిర్మలమ్మ, అలివేలమ్మ, రాజశేఖర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసులు, నాయకులు ఎం.బీసన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి, పీడీఎస్‌యూ నాయుకలు భాస్కర్, జిల్లా నాయకులు రమణ, అది, మాలమహానాడు నాయకులు ఓబులేసు, వెంకటేష్‌లను ముందస్తు అరెస్టు చేశారన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, అక్రమంగా గృహనిర్బంధం ఉంచడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య హక్కులు కాలరాసే విధంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ పోలీసు చర్యలు నిరసిస్తున్నామన్నారు. 11 ఏళ్ళ కాలంలో మోడీ ఏపీకి ఏం ప్రయోజనం చేకూర్చారో చెప్పాలన్నారు. ప్రజాస్వామ్య వాదులు పోలీసుల దుందుడుకు విధానాలను ఖండించాలని కోరారు.

వామపక్ష నాయకుల అక్రమ అరెస్టులను ఖండించండి : బి.గిడ్డయ్య

విశాలాంధ్ర - కర్నూలు : నరేంద్ర మోడీ కర్నూలు పర్యటన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అర్ధరాత్రి, తెల్లవారు జాము నుండి వామపక్ష పార్టీల నాయకులను అక్రమ అరెస్టులు చేయడం, గృహ నిర్బంధాలు చేయడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎన్.లెనిన్ బాబు ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, సీపీఎం నగర కార్యదర్శి రాజశేఖర్, సీపీఐ నగర సహాయ కార్యదర్శులు చంద్రశేఖర్, మహేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, నగర కార్యదర్శి ఎం.బీసన్న, కోసిగిలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రాజు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఉ. సోమన్న, నాయకులు వీరేష్, ఏపీ మహిళా సమైక్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణిలను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో నిర్బంధించారని, వారిని తక్షణమే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇవ్వకుండా, వెనుకబడిన రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా, రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండ ద్రోహం చేసిన నరేంద్ర మోడీకి కర్నూలులో పర్యటించే నైతిక హక్కు లేదని, ఎన్నికల తర్వాత ఆంధ్ర రాష్ట్రంలో నాలుగు సార్లు పర్యటించారని, రాష్ట్ర అభివృద్ధికి ఏమాత్రం నిధులు కేటాయించిన పాపాన పోలేదన్నారు. పర్యటనలకు రూ.1500 కోట్లకుపైగా దుర్వినియోగం చేశారని, ఈ డబ్బులు రాష్ట్రంలో ఒక ప్రాజెక్టు కట్టడానికి ఉపయోగించి ఉంటే ప్రజలకు ఉపయోగపడేదని వారు విమర్శించారు.

ఘనంగా ధ్వజస్తంభ - నందివిగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర- చిప్పగిరి: మండల పరిధిలోని నంచర్ల గ్రామం నందు మార్కండేయ స్వామి ధ్వజస్తంభ ప్రతిష్టను భక్తాదులు నిర్వహించారు. గురువారం గ్రామ పరిధిలో పురాతన గుడిలో మార్కండేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నంచర్ల గ్రామానికి చెందిన కీర్తిశేషులు టీచర్ బుక్క పిండ్ల ఆంజనేయ భార్య బుక్క పిండ్ల అచ్చమ్మ మార్కండేయ స్వామి దేవాలయమునకు ధ్వజస్తంభము, నంది విగ్రహమును వితరణ చేయడంతో భక్తాదుల మధ్య భక్తి శ్రద్ధలతో మార్కండేయ స్వామికి పూజలు నిర్వహించి ధ్వజస్తంభ, నంది విగ్రహ ప్రతిష్టను ఘనంగా నిర్వహించారు. ధ్వజస్తంభ ప్రతిష్ట సందర్భంగా నంచర్ల గ్రామ ఆడపడుచులకు ఒడిబియ్యం పోసి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

స్వర్ణాంధ్రతోనే వికసిత్ భారత్ లక్ష్యం సాకారం

- గూగుల్ రాకతో ప్రపంచమంతా ఏపీ వైపు చూస్తోంది
- చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి
- ఏపీలో రూ.13,429 కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టిన ప్రధాని
- సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : వికసిత్ ఏపీతోనే వికసిత్ భారత్ లక్ష్యం సాకారం అవుతుందని ప్రధాని నరేంద్రమోడీ వ్యాఖ్యానించారు. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించినప్పుడే జీఎస్టీ సంస్కరణలకు సార్థకత చేకూరుతుందని స్పష్టం చేశారు. వికసిత్ భారత్, ఆత్మనిర్భర్ భారత్ వంటివి సాకారం కావడంలో ఏపీ కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని స్పష్టం చేశారు. ఏపీ యువత ఎంతో చైతన్య కలిగిన వారని, సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వంటి వారి నేతృత్వంలో ఏపీ అభివృద్ధి పథంలో వెళ్తోందని కేంద్రం పూర్తిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సహకరిస్తుందని ప్రధాని నరేంద్రమోడీ చెప్పారు. గురువారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ బహిరంగ సభ నన్నూరు చెక్ పోస్ట్ సమీపంలో జరిగింది. శ్రీశైలంలో మల్లిఖార్జున స్వామి వారిని, భ్రమరాంబ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం అనంతరం ప్రధాని కర్నూలు చేరుకున్నారు. కర్నూలులో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ జీఎస్టీ బచత్ ఉత్సవ్‌పై ఏర్పాటు చేసిన బహిరంగ సభా వేదికకు చేరుకున్న ప్రధానికి మంత్రులు, ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికారు. హెలీ ప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఓపెన్ టాప్ జీపులో ప్రజలకు అభివాదం చేస్తూ వేదికపైకి చేరుకున్నారు. ఓపెన్ టాప్ జీపులో ర్యాలీగా వచ్చిన ముగ్గురు నేతలకు భారత్ మాతాకీ జై అంటూ మువ్వెన్నల జెండాలతో ప్రజలు స్వాగతం పలికారు. బహిరంగ సభలో జీఎస్టీ సంస్కరణలపై ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ "ఆంధ్రప్రదేశ్ శాస్త్రసాంకేతికంగా అభివృద్ధి చెందిన ప్రాంతం, యువత ఎంతో చైతన్యవంతులు. ఏపీలో విజన్ ఉన్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ లాంటి నేతలు ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా ఉంది. గత 16 నెలల్లో డబుల్ ఇంజన్ సర్కారు వల్ల ఏపీలో ప్రగతి వేగంగా జరుగుతోందని, ఢిల్లీ, అమరావతిలు రెండూ అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు వెళ్తున్నాయన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి దిశగా నడుస్తోంది. భారత్ దేశంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రగతి వేగాన్ని ప్రపంచం గమనిస్తోంది. గూగుల్ లాంటి ఐటీ దిగ్గజం ఏపీలో అతిపెద్ద పెట్టుబడిని ప్రకటించింది. దేశపు తొలి అతిపెద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కేంద్రం విశాఖలో ఏర్పాటు చేయాలని నిర్ణయించిందన్నారు. 21వ శతాబ్దపు మాన్యుఫాక్చరింగ్ కేంద్రంగా ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భారత్ ఉత్పత్తి కేంద్రంగా రూపు దిద్దుకుంటోంది. ఆత్మనిర్భర్ భారత్‌లో ఏపీ కీలకంగా మారిందని ప్రధాని అన్నారు. ఈ ప్రాజెక్టులన్నీ రాష్ట్రంలో కనెక్టివిటీ బలోపేతం కావటంతో పాటు పరిశ్రమలను బలోపేతం చేస్తాయన్నారు. ఈ జీఎస్టీ సంస్కరణల వల్ల రూ.8 వేల కోట్ల మేర ప్రజలకు ఆదా అవటం సంతోషమని, కానీ ఆ ప్రయోజనాలు అందరికీ అందాల్సి ఉందన్నారు. అప్పుడే అది సఫలమైనట్టు. 21వ శతాబ్దం భారత దేశానిది, 140 కోట్ల మంది భారతీయులదని ప్రధాని చెప్పారు. 2047కు వికసిత్ భారత్‌గా సూపర్ పవర్ మారుతుందని, వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా 2047కు దేశం సూపర్ పవర్‌గా మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. ఒకే మార్కెట్ నినాదంతో వచ్చిన జీఎస్టీ పన్ను విధానంలో ప్రస్తుత సంస్కరణల వల్ల 99 శాతం వస్తువులు సున్నా నుంచి 5 శాతం పన్ను పరిధిలోకి వచ్చాయని, తద్వారా అన్ని వస్తువుల ధరలు తగ్గాయని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. జీఎస్టీ 2.0 తో పన్నులు తగ్గి పేదలు, మధ్యతరగతికి గణనీయంగా ఉపశమనం కలిగిందని అటు వ్యాపారులు, ఎంఎస్ఎంఈ వర్గాలకూ ప్రయోజనం చేకూరుతోందని స్పష్టం చేశారు. జీఎస్టీ తగ్గింపుతో ప్రతీ కుటుంబానికీ రూ.15 వేల వరకూ ఆదా అవుతుందని స్పష్టం చేశారు. దసరా నుంచి దీపావళి వరకూ జీఎస్టీ సంస్కరణల్ని పండుగలా నిర్వహిస్తు న్నామని వెల్లడించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకూ 98 వేల ఈవెంట్లు నిర్వహించి అవగాహన కల్పి స్తున్నట్టు వివరించారు. జీఎస్టీ బచత్ ఉత్సవ్ కాస్తా ఇవాళ భరోసా ఉత్సవ్‌గా మారిందన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రానికి డబుల్ ప్రయోజనాలు కలుగుతు న్నాయని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఏపీలో రూ.13,429 కోట్ల కేంద్ర ప్రాజెక్టులు : రాష్ట్రంలో విద్యుత్, రైల్వే, జాతీయ రహదారులు, పారిశ్రామిక, రక్షణ రంగాలకు చెందిన రూ.13,429 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రధాని శ్రీకారం చుట్టారు. వర్చువల్ విధానం ద్వారా వివిధ ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు. అలాగే ఇంకొన్నింటిని శంకుస్థాపనలు చేశారు. మరో రెండు ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. రూ.9,449 కోట్ల విలువైన 5 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. రూ.1704 కోట్ల విలువైన 8 అభివృద్ధి పనులను ప్రధాన మంత్రి ప్రారంభించారు. ఇక రూ.2276 కోట్ల విలువైన 2 ప్రాజెక్టులను ప్రధాని జాతికి అంకితం చేశారు. అనేక పరిశ్రమలకు శంఖుస్థాపన చేశారు. అంతకు ముందు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, యువనేత నారాలోకేష్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తదితరులు ప్రసంగించారు. వందలాది వాహనాల్లో ప్రజలను తరలించారు. సుమారు మూడు లక్షల మందిసభకు హజరైనట్లు అధికారులు తెలియచేస్తున్నారు.

పీఎం భారీ బహిరంగ సభకు ఆహ్వానం లేదు : సర్పంచ్ బ్రహ్మయ్య

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గురువారం నిర్వహించిన గ్రామసభకు తనకు ఎలాంటి ఆహ్వానం అందలేదని నన్నూరు గ్రామ సర్పంచ్ బ్రహ్మయ్య తెలిపారు. ప్రోటోకాల్ మేరకు గ్రామసర్పంచ్ మొదటి పౌరుడు అయినప్పటికీ మండల అధికారులు, జిల్లా అధికారులు, ప్రభుత్వం నుంచి సైతం తనకు ఎలాంటి పిలుపు, సమాచారం లేదని గ్రామ సర్పంచ్ మండి పడ్డారు. గ్రామసర్పంచ్‌ను ఆహ్వానించకపోవడంపై పలువురు ప్రముఖులు, విమర్శ కులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పిల్లల ఎదుగుదలకు సహకరించాలి

విశాలాంధ్ర - హొళగుంద: పిల్లల ఎదుగుదలకు పిల్లల తల్లి దండ్రులు సహకరించాలని ఎంపీడీవో విజయ లలిత విజ్ఞప్తి చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎనిమిదో పోషణ మాసం సందర్భంగా గర్భిణీ మహిళలకు శ్రీమంతం చేశారు. వంటకాల తయారీ నమూనాను ప్రదర్శించారు. ఎంపీడీవో విజయ లలిత మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు, బాలింతలకు, గర్భిణీలకు తగిన మోతాదులో పౌష్టికాహారం అందించాలని, పిల్లల ఎదుగుదలతో పాటు చదువు నేర్పాలని అన్నారు. వంట నూనె బరువు తగ్గించాలని మహిళలు డీజలీకరణ వైపు మారిపోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా కిషోర్ బాలికలకు ,మహిళలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నాయని, వాటిని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్వాడి సూపర్వైజర్లు షీబా రాణి, పద్మావతి, సౌభాగ్య, ఈరమ్మ, వెలుగు సీసీ హనుమంతు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు. అంగన్వాడీ టీచర్లు, ఉద్యోగులు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు.

కంది పంటను పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర- చిప్పగిరి: రైతు కష్టాలు వర్ణణా తీతం అనే విశాలాంధ్ర శీర్షకు స్పందించిన మండల వ్యవసాయ అధి కారులు. గురు వారం మండల పరిధి లోని నంచర్ల గ్రామం నందు రైతులు సాగు చేసిన కంది పంటను పరిశీలించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి శ్రీరామ్ ప్రవీణ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు దెబ్బ తిన్న కంది పంటలను పరిశీలించామని, వర్షాలకు నాశనమైన కంది పంటలకు సంబంధించి నివేదికలను జిల్లా ఉన్నత అధికారులకు పంపుతామన్నారు. మండల వ్యవసాయ విస్తరణ అధికా రిని రమాదేవి, ఎంపీఈవో వివేక్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తే అరెస్టు చేయడం సిగ్గు చేటు : సీపీఐ

విశాలాంధ్ర - కర్నూలు : ప్రధాని నరేంద్ర మోడీ జిల్లా పర్యటన సందర్భంగా పోలీసుల అత్యుత్సాహంతో సీపీఐ నాయకులను తెల్లవారు జాము నుండే అక్రమంగా అరెస్టు చేయడం, నిర్బంధించడాన్ని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. శాంతి యుతంగా నిరసన తెలియచేస్తుశ్రీన్న నేతలను పోలీసులు వారిని బలవంతంగా అరెస్టు చేయడానికి ప్రయత్నించారు. పోలీసులకు సీపీఐ నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ నగర సహాయ కార్యదర్శి సి.మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసులు మాట్లాడుతూ ఏపీకి నిధులు ఇవ్వలేని ప్రధాని నరేంద్ర మోడీ జిల్లాల పర్యటిస్తుంటే అడగాల్సిన అధికార ప్రతిపక్షా పార్టీలు మౌనం వహించడం కాకుండా సిగ్గు చేటన్నారు. వామపక్ష పార్టీలు ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధి కోసం విభజన హామీలు అమలు చేయాలని, కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేసి వెనుకబడిన రాయలసీమ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఉంటే రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల చేత వామపక్ష పార్టీల నాయకులను అరెస్టు చేయించడం దుర్మార్గమన్నారు. అక్రమ అరెస్టును నిరసిస్తూ సీపీఐ నాయకులు మూడో పట్టణ పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ఎం.బీషన్న, ఏపీ మహిళా సమైక్య జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి నగర నాయకురాలు పావని, మునెమ్మ, నాగేశ్వరమ్మ, ధనలక్ష్మి, సోఫియా, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు అన్వర్, ఏఐవైఎఫ్ నగర నాయకులు నాగరాజు, కృష్ణ, అఖిల్, చంటి, కళాకారు, రవి రసూల్, సీపీఐ నగర నాయకులు కుమార్ రాజా, అశోకు, ప్రసాదు, రాముడు, తదితరులు పాల్గొన్నారు

న్యాయవాద వృత్తిలో అంకితభావంతో పని చేయాలి

విశాలాంధ్ర-పత్తికొండ: న్యాయవాద వృత్తిలో అంకితభావంతో పనిచేయాలని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భాస్కర్ సూచించారు. పత్తికొండ బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా పనిచేస్తున్న హరికృష్ణ ఆచారి సతీమణి టి.రాధా కృష్ణ వేణి గురువారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో న్యాయవాదిగా సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా కోర్టు విధులకు హాజరై సీనియర్ న్యాయవాదుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. తమ వృత్తి పట్ల సామాజిక బాధ్యతను గుర్తించి, ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ న్యాయవాద వృత్తిలో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు రంగస్వామి. న్యాయవాదులు నాగభూషణ్ రెడ్డి, సూరజ్, నాగేష్, మహేషు, సురేంద్ర, నరసింహులు, సుధా కృష్ణ, ప్రసాద్, నాగరాజు యాదవ్, శ్రీనివాసులు యాదవ్, వెంకటేశ్వర్లు, ఎర్రిస్వామి, నాగ లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, లక్మన్న తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు పొందిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: మండలంలో 2025 జూన్లో బదిలీలు పొంది తిరిగి అదే పాఠశాలలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్న ఉపాధ్యాయులను రిలీవ్ చేసి వారు బదిలీ పొందిన పాఠశాలకు పంపాలని ఎస్టియు రాష్ట్ర అకాడమిక్ కమిటీ మెంబర్ మహాదేవప్ప డిమాండ్ చేశారు. గురువారం మండల విద్య శాఖ కార్యాలయంలో ఎస్టీయూ ఆదోని మండల సమితి జిల్లా కార్యవర్గ సభ్యులతో కలిసి మండల విద్యాశాఖ అధికారులు శ్రీనివాసులు, భూపాల్ రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. అకాడమిక్ కమిటీ మెంబర్ మహాదేవప్ప, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసీ సుంకన్న మాట్లాడుతూ గత 8 ఏళ్లుగా ఒకే స్టేషన్లో పనిచేసి తిరిగి అక్కడ రిలీవర్ రాక ఆగిపోయిన ఉపాధ్యాయులను బదిలీలు పొందిన పాఠశాలకు పంపించివేయాలని కోరారు. ఎస్టీయూ రాష్ట్ర ఆదోని మండలం ప్రధాన కార్యదర్శి సుధాకర్ బాబు, సీనియర్ నాయకులు రామ్మోహన్ రెడ్డి, ఎస్ఎస్ భాస్కర్, సూర్యుడు, ఆంజనయ్య, లక్ష్మన్న, రామాంజనేయులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి రూ.5 లక్షల సాయం

విశాలాంధ్ర - కర్నూలు : కర్నూలు మండలం మునగాలపాడు గ్రామానికి చెందిన కార్యకర్త అర్జున్ కర్నూలులో జరిగే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మీటింగ్ ప్రాంగణం దగ్గర విద్యుత్ తీగెలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. విషయం టీడీపీ సీనియర్ నాయకులు, కేడీసీసీబీ చేర్మెన్ డి.విష్ణువర్ధన్ రెడ్డి హుటాహుటిన హాస్పిటల్ దగ్గరకు వెళ్లి మృత దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. తన సొంత నిధులు రూ.5లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. మట్టి ఖర్చులకు రూ.20 వేల నగదు అందజేశారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదారర్చారు. విషయం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసికెళ్లి అర్జున్ కుటుంబాన్ని ఆదుకుంటామని డి.విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు.

ఎస్ఎస్ ట్యాంక్ పనులు త్వరలో ప్రారంభం

విశాలాంధ్ర - ఆదోని : పట్టణ ప్రజల దాహార్తి తీర్చే బసాపురం ఎస్ఎస్ ట్యాంక్ తాత్కాలిక మరమ్మత్తు పనులు త్వరలో మొదలు పెట్టడం జరుగుతుందని డిప్యూటీ ఇంజనీర్ వెంకటాచలపతి తెలిపారు. గురువారం బసాపురం ఎస్ఎస్ ట్యాంకును పరిశీలించారు. రానున్న వేసవి కాలంలో ఆదోని పట్టణంలో ఎలాంటి నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు బసాపురం ఎస్ఎస్ ట్యాంక్ మరమ్మత్తు పనుల కోసం డిపిఆర్లు కౌన్సిల్లో ఆమోదించడం జరిగిందని, ప్రజాప్రతినిధుల ప్రత్యేక చొరవతో త్వరలోనే పనులను ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ఎస్ఎస్ ట్యాంకులో మరమ్మత్తు పనులు జరుగుతున్న పట్టణంలో నీటి సమస్య, నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండదని సూచించారు. బసాపురం ఎస్ఎస్ ట్యాంక్ శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి నిధుల కోసం నివేదిక పంపడం జరిగిందని తెలిపారు.

మెడికల్ కాలేజీలను కాపాడుకుందాం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : రాష్ట్రంలోని 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం కాకుండా కాపాడుకోవడం అందరి సామాజిక బాధ్యతగా గుర్తించుకోవాలని మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి హితవు పలికారు. గురువారం పెద్దకడబూరు గ్రామంలో వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల పీపీపీ విధానాన్ని నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అట్టహాసంగా ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్మోహన్ రెడ్డి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు అనుమతి తెచ్చి, ఏడు మెడికల్ కాలేజీలను ప్రారంభించారన్నారు. మిగిలిన 10 మెడికల్ కళాశాలల నిర్మాణాలు వివిధ దశలలో ఉన్నాయని స్పష్టం చేశారు. వైసీపీ బూత్ కమిటీ తాలూకా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, గ్రామ సర్పంచులు చంద్రశేఖర్, ఇస్మాయిల్, జాలవాడి ఎంపీటీసీ వెంకటేష్, పాల్గొన్నారు.

ప్రాజెక్ట్ సందర్శనకు వెళ్లి, ఇరువురు విద్యార్థులు గల్లంతు..

- గాజులదిన్నె ప్రాజెక్ట్ దగ్గర విషాదం
- ఒకరి మృతదేహం లభ్యం
- మరొకరి కొరకు గాలింపు చర్యలు

విశాలాంధ్ర -గోనెగండ్ల: మండల పరిధిలోని గాజులదిన్నె ప్రాజెక్టు సంజీవయ్య సాగర్ దగ్గర గురువారం విషాదం చోటుచేసుకుంది. పాజెక్టుకు వరద ప్రవాహం ఉండడంతో ఓ గేటు ఎత్తి 300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కొంతమంది కాలేజీ యువకులు సందర్శనకు వెళ్లి ప్రాజెక్టు గేటు ముందు ఉన్న చిన్న కొండరాయిపై నిలబడి ఫోటోలు దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి నీళ్లలో పడ్డారు. నీటి ప్రవాహం పెరగడంతో ఒక్కసారిగా ఇద్దరు విద్యార్థులు నీటిలో గల్లంతయ్యారు. ఈ విద్యార్థులు ఎమ్మిగనూరుకు చెందిన చెన్నారెడ్డి, ఉదయ్ కుమార్‌లుగా గుర్తించారు. వీరు స్థానిక సేయింట్ జోషఫ్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్నట్లు స్నేహితులు తెలిపారు. విద్యార్థుల కోసం పోలీసులు, గజ ఈతగాళ్లు గాలింపు చర్యలు చేపట్టగా, 2 గంటల తర్వాత చెన్నారెడ్డి మృతదేహం లభ్యమైంది. ఉదయ్ కుమార్ మృతదేహం కోసం గాలింపు చేపడుతున్నారు. ఇద్దరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొనడంతో, ప్రాజెక్ట్ పరిసరాల్లో బాధిత కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ విషాద సంఘటన అందరికీ కంటతడి పెట్టించాయి.

పూడికతో నిండిపోయిన బావి

విశాలాంధ్ర - హొళగుంద: సిద్దేశ్వర స్వామి ఆలయ ఆవరణంలో పురాతన బావి పూడికతో నిండి పోయింది. పురాతన బావిలో చెత్త తోపాటు ప్లాస్టిక్ బాటిళ్ల నీరు ఉపయోగం వస్తువులను వేయడం వల్ల భావి చెత్తతో పూర్తిగా నిండిపోయింది. బావి పూర్తిగా చెత్తతో నిండిపోవడం వల్ల పరిసర ప్రాంతమంతా దుర్గంధంగా మారిందని భక్తులు గురువారం తెలిపారు. బావి పక్కనే బన్నీ మహంకాళి ఆలయం ఉండడం వల్ల భక్తులు దర్శనం కోసం అధిక సంఖ్యలో వస్తారు ప్రమాదవశాత్తు బావిలో పడితే దిక్కు ఎవరని భక్తులు అధికారులను ప్రశ్నించారు. బావి చుట్టూ గోడ లేక పోవడంతో ప్రమాదకరంగా మారిందని భక్తులు భయాందోళన చెందారు. బావిలోని పూడికను విలిస్తే దుర్గంధంగా ఉండదని, బావి పరిశుభ్రంగా ఉంటుందని, సంబంధిత అధికారులు బావిలోని పూడికను వెంటనే తొలగించాలని భక్తులు డిమాండ్ చేశారు.

కర్నూలులో మొట్టమొదటి ఈకోర్టు ప్రారంభం



విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: కర్నూలులో గురువారం ఉదయం మొట్టమొదటి ఈకోర్టు ను కర్నూలు మెడికల్ కళాశాలలో ప్రారంభోత్సవం చేశారు. ఈ కోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా.ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా.చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకోర్టు ద్వారా వైదులకి ఎంతో ఉపయోగకరం అని, దీని ద్వారా వైద్యులకు ఎంతో సమయం అదా అవుతుందని, పని చేసే ప్రదేశం నుండే రాష్ట్రంలోని ఏ కోర్టుకు అయినా ఇక్కడి నుండే ఈకోర్టు ద్వారా మెడికల్ ఎవిడెన్స్ అందించే చక్కటి అవకాశం లభిస్తుందని ఆయన తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మొట్ట మొదటి ఈకోర్టు ఇదేనన్నారు. ఈ వ్యవస్థ ద్వారా కర్నూలు మెడికల్ కాలేజీ, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో పని చేస్తున్న వైద్యులు, సిబ్బంది ప్రభుత్వ సంబంధిత కోర్టు కేసులలో వారి సాక్ష్యాన్ని ఇక్కడి నుండే రాష్ట్రంలో ఏ కోర్టుకైనా ఇవ్వవచ్చునని, దీని ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంఈ, మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నర్సమ్మ, వైస్ ప్రిన్సిపల్స్ డా.రేణుక, డా.సాయి సుధీర్, ఫోరెన్సిక్ ప్రొఫెసర్ డా.బ్రహ్మాజీ, డా.సుధ కుమారి, డా.నాగార్జున, డా.కోటేశ్వరరావు, డా.హరీష్ కుమార్, డా.సురేఖ, డా.సాహిల్ పాల్గొన్నారు.